తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 08- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 34 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# బాలల ఆరోగ్యమే తెలంగాణ భవిష్యత్తు

## నాచారంలో నూతన బాలామృతం తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

### పౌష్టికాహారం, నాణ్యమైన విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### మహిళల సాధికారత, బాలల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన బాలలే తెలంగాణ భవిష్యత్తును నిర్మిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ ఆహార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బాలామృతం తయారీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉత్పత్తి, ప్యాకింగ్ విభాగాలను పరిశీలించి మొక్క నాటారు. గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి చిన్నారి ఎదుగుదల వరకు సరైన పోషకాహారం అందితేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మెరుగైన పోషకాహారం పొందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని చెప్పారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని అధికారులకు స్పష్టం చేశారు.

గతంలో ప్రారంభమైన బాలామృతం కేంద్రం క్రమంగా విస్తరించి నేడు పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు కూడా పౌష్టికాహారం సరఫరా చేసే స్థాయికి ఈ సంస్థ అభివృద్ధి చెందిందన్నారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు

మిగతా 2లో



# డిజిటల్ పాలనకు సీఎం ఆదేశాలు

- పూర్తి స్థాయిలో డిజిటలీకరణ
- ఉద్యోగుల జీతాల్లో పారదర్శకత
- 100 రోజుల్లో నివేదిక

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర పరిపాలనలో మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సమగ్ర డిజిటల్ పాలన అమలుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి,

మిగతా 2లో




# కృత్రిమ మేధలో తెలంగాణకు ప్రపంచ గుర్తింపు



- బాధ్యతాయుత కృత్రిమ మేధ లక్ష్యం
- హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు
- ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

కృత్రిమ మేధ రంగంలో తెలంగాణ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను సమన్వయం చేస్తూ బాధ్యతాయుత కృత్రిమ మేధ ప్రమాణాలను రూపొందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతోందని పేర్కొన్నారు.

మిగతా 2లో



# బీసీ సంక్షేమంపై మంత్రి కీలక ఆదేశాలు

- గురుకులాల్లో నాణ్యతకు ప్రాధాన్యం
- స్టడీ సర్కిల్స్‌కు ప్రత్యేక కమిటీ
- కులవృత్తుల మేళాకు ఏర్పాట్లు

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులాలు, హాస్టళ్లలో పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన భోజనంపై ఎలాంటి రాజీ ఉండకూడదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన వాతావరణంలో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు అందేలా జిల్లా బీసీ సంక్షేమ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిల్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను

మిగతా 2లో

# మొబైల్ అంగన్వాడి సేవల ప్రారంభం

- ఏ చిన్నారి దూరం కాదు
- వలస కుటుంబాలకు సేవలు
- మంత్రి సీతక్క

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో అంగన్వాడి సేవలను ప్రతి చిన్నారికి చేరవేసే లక్ష్యంతో ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించింది.

మిగతా 2లో




# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- రూ.360 కోట్లతో నిర్మాణాలకు శ్రీకారం
- ప్రజలకు ఆధునిక సేవలే లక్ష్యం
- అధికారులతో మంత్రి సమీక్ష



హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేసి ప్రజలకు ఆధునిక, పారదర్శక సేవలు అందించేందుకు తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం భవనాల నిర్మాణ పురోగతిపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ తొలి విడతలో అద్దె భవనాల్లో లేదా శిథిలావస్థలో పనిచేస్తున్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో కొత్త భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

మిగతా 2లో

# కవిత పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సూచన

- ముందుగా ఈసీకి సమాధానం ఇవ్వండి
- ఇప్పుడే జోక్యం కుదరదు
- టీఆర్ఎస్ పేరుపై వివాదం



న్యూఢిల్లీ, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

కొత్త రాజకీయ పార్టీ పేరుకు సంబంధించి నెలకొన్న వివాదంపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ప్రస్తుతం ఎన్నికల సంఘం ప్రక్రియలో జోక్యం చేసుకోవడం సరైంది కాదని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు హైకోర్టు సూచించింది. ఎన్నికల సంఘం తన విధుల పరిధిలో నిర్ణయాలు తీసుకుంటున్నందున, ఈ దశలో న్యాయస్థానం

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బాలల ఆరోగ్యమే తెలంగాణ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి పరిశ్రమలు మరిన్ని రావాలని, ప్రభుత్వం అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. విద్యారంగంలో కూడా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది విద్యారంగానికి భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, దానిని ఖర్చుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేదల పిల్లలకు కూడా ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.




మహిళల సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు రుణాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, మహిళా శక్తి కేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా భోజనశాలలు వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. హైదరాబాద్ వంటి నగరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ నిరుపేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పిల్లల ఆరోగ్యం, మహిళల సాధికారత, నాణ్యమైన విద్య, సమగ్ర సంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ పాలనకు సీఎం ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగుల వివరాలు, జీతాలు, బ్యాంకు ఖాతాల సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి గరిష్ఠంగా ఐదో తేదీలోపు జీతాలు పారదర్శకంగా ఉద్యోగుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉన్నాయని, వాటిలో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ ప్రయోజనాలు అందించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు అందుకున్నప్పటికీ ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించని ఘటనలు వెలుగులోకి వచ్చాయని వివరించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ పాలన ద్వారా జీతాల చెల్లింపులు, ఉద్యోగుల సంక్షేమ ప్రయోజనాల అమలును నిరంతరం పర్యవేక్షించి అక్రమాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలని సూచించారు.



ఈ అంశంపై సమగ్ర అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి అమలు చేయాల్సిన చర్యలపై స్పష్టమైన సిఫారసులు చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేసి హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాల అమలును మరింత సులభతరం చేయాలని చెప్పారు. డిజిటల్ పాలన ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, హెచ్ఆర్డీ ఉపాధ్యక్షురాలు శాంతికుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధలో తెలంగాణకు ప్రపంచ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల హరిత వృద్ధి ఆర్థిక సదస్సును పరిశ్రమలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కృత్రిమ మేధ అంటే కేవలం గణన వ్యవస్థలు, సమాచార నిల్వ కేంద్రాలు మాత్రమే కాదని, విద్యుత్, నీరు, భూమి, మానవ వనరులు వంటి అంశాలు కూడా కీలకమని అన్నారు. కృత్రిమ మేధను వ్యతిరేకించడం కాదని, అది ఎలా అభివృద్ధి చెందాలో ప్రపంచానికి తెలంగాణ మార్గనిర్దేశం చేస్తోందని స్పష్టం చేశారు.







పునరుత్పాదక ఇంధన వినియోగం, వనరుల బాధ్యతాయుత వినియోగంతో హైదరాబాద్‌ను కృత్రిమ మేధకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పెట్టుబడులు వస్తూనే స్థానిక ప్రజలకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిశ్రమలకు భూమి, నీరు, విద్యుత్ కేటాయించడం మాత్రమే కాకుండా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, స్వచ్ఛ ఇంధన వినియోగం, పునర్వినియోగ నీటి వినియోగం తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రపంచం కార్బన్ క్రెడిట్ గురించి మాట్లాడుతున్న సమయంలో తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకున్న "ప్రజల ప్రోత్సాహం" భావనను ముందుకు తీసుకొస్తోందని వివరించారు.

సాంకేతికత వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు పోటీగా మారకూడదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా, భాషా అవరోధాలను తొలగించేలా కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, పారదర్శక పాలన, ప్రజాకేంద్రిత అభివృద్ధి విధానాలతో హైదరాబాద్‌ను బాధ్యతాయుత కృత్రిమ మేధకు ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

# మొబైల్ అంగన్వాడి సేవల ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి వివేక్‌తో కలిసి మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం తొలి దశలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులే దేశ సంపద, భావితరాలకు పునాదని అన్నారు. తెలంగాణ-2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు.



వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి-శిశు సంక్షేమ సేవలు అందించేందుకు ఈ మొబైల్ కేంద్రాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వంటి నగరాలకు ఉపాధి కోసం వచ్చే కుటుంబాల చిన్నారులు అంగన్వాడి సేవలకు దూరం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో సాధారణ అంగన్వాడి కేంద్రాల్లో అందించే అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి-శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలను ఈ వాహనాల ద్వారా నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్తామని చెప్పారు.

ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి సీతక్క తెలిపారు. ఒక్కో వాహనం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.




# బీసీ సంక్షేమంపై మంత్రి కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా అమలు చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న నమూనాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని చెప్పారు. జూలై 16 నుంచి హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని వర్గాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే కుట్టు మిషన్ పథకం అమలుకు సమగ్ర మార్గదర్శకాలను సిద్ధం చేయాలని సూచించారు.

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి తెలిపారు. ఆర్థిక సహాయ పథకాలపై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఐఐటీలు, ఐఐఎంలలో ప్రవేశాలు పొందిన గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గురుకులాలు, హాస్టళ్లను ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరం పరిశీలించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయ దేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

అలాగే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో ఉప మహా తనిఖీ అధికారి కార్యాలయాల నిర్మాణానికి రూ.97 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొత్తం రూ.360 కోట్లతో ఈ నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అన్ని భవనాలను ఒకే నమూనాలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేలా రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. నిర్మాణ బాధ్యతలను తెలంగాణ గృహనిర్మాణ సంస్థకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని భవనాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 సమగ్ర కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ భవనాలు నిర్మిస్తున్నామని, నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా ఆయా సంస్థలే చేపడతాయని వెల్లడించారు. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



# కవిత పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సూచన

(మొదటి పేజీ తరువాయి)

జోక్యం చేసుకోవడం ఆ సంస్థ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లే అవుతుందని ధర్మాసనం పేర్కొంది.

బీఆర్ఎస్ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'కి సంక్షిప్త రూపంగా 'టీఆర్ఎస్' ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందిందని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. అదే సంక్షిప్త నామం కొత్త పార్టీకి కూడా రావడం వల్ల ఓటర్లలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటూ జూన్ 23న కవితకు నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ నోటీసులను కవిత హైకోర్టులో సవాలు చేశారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు అనుమతి ఇవ్వాలని, ఈసీ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోర్టును కోరారు. అయితే ఈ దశలో ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియను నిలిపివేయడానికి కోర్టు నిరాకరించింది.

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన అనంతరం ఈ ఏడాది ప్రారంభంలో కవిత సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్‌లో 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఎన్నికల సంఘం ప్రాథమిక ఆమోదం తెలిపింది. అనంతరం ఈ పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించే ప్రక్రియ చేపట్టింది. 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం గతంలో బీఆర్ఎస్ పాత పేరును పోలి ఉందని పేర్కొంటూ 1,100కు పైగా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందాయి. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఈసీ కవితకు వివరణ కోరగా, ముందుగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు సూచించింది. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం ఎన్నికల సంఘం పరిశీలనలోనే కొనసాగనుంది.

# మాదిగల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం



- **ఎస్సీ వర్గీకరణ ఫలాలు ప్రతి మాదిగ కుటుంబానికి చేరాలి: అడ్డూరి అనిల్ మాదిగ**

**ఎల్కతుర్తి, జూలై 7 (తెలంగాణ ముచ్చట్లు):** మాదిగల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గమని, మూడు దశాబ్దాలకు పైగా సాగిన ఉద్యమ ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలు ప్రతి మాదిగ కుటుంబానికి అందేలా ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, అలాగే పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ, 32 సంవత్సరాల నిరంతర ఉద్యమం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. ఉద్యమం ద్వారా లభించిన అవకాశాలను ప్రతి మాదిగ బిడ్డ సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ముందుకు రావాలని సూచించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని కొనియాడిన ఆయన, ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ల పెంపు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల వెనుక ఎమ్మార్పీఎస్ ఉద్యమాల పాత్ర ఉందని పేర్కొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని, ఎస్సీ వర్గీకరణ సాధించిన ఐక్యతతోనే మరిన్ని హక్కులను కూడా సాధించుకోవచ్చని అన్నారు. యువత ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక న్యాయం సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తీక్ మాదిగ, ఎల్కతుర్తి సర్పంచ్ మునిగడప లావణ్య-శేషు, చింతలపల్లి సర్పంచ్ బొంకూరి రజిత, ఇంద్రనగర్ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్, మాదిగ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు బొంకూరి వంశీ మాదిగ, సీనియర్ నాయకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హరిత బావుపేట నిర్మాణానికి శ్రీకారం



- **రోడ్డు ఇరువైపులా 400 మొక్కలు నాటిన సర్పంచ్ బత్తిని రవీందర్**

**ఎల్కతుర్తి, జూలై 7( తెలంగాణ ముచ్చట్లు):** హరిత బావుపేట నిర్మాణానికి శ్రీకారం చుడుతూ ఎల్కతుర్తి మండలం లోని బావుపేట గ్రామంలో మంగళవారం రోడ్డు ఇరువైపులా విస్తృత స్థాయిలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ బత్తిని రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బావుపేట నుంచి గుంటూరుపల్లె వరకు సుమారు 400 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ బత్తిని రవీందర్ మాట్లాడుతూ, పచ్చదనమే గ్రామాభివృద్ధికి, ప్రజల ఆరోగ్యానికి మూలాధారమని అన్నారు. మొక్కలు మానవ మనుగడకు ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నేటి అవసరాల కోసం చెట్లను నరికివేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. రోడ్ల వెంట మొక్కలు పెరగడం వల్ల ప్రయాణికులకు నీడ లభించడంతో పాటు గ్రామ సౌందర్యం పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. పండ్ల చెట్ల పెంపకంతో పక్షులు, ఇతర జీవరాశులకు ఆహారం లభించడమే కాకుండా కోతుల బెడద కూడా కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుందని చెప్పారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి చెట్లుగా పెరిగే వరకు పర్యవేక్షిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రాణాలు పోతున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వేలాడే తీగలే సాక్ష్యం

- **దామరలో కరెంట్ షాక్‌తో పాడి ఆవు, పెంపుడు కుక్క మృతి**
- **రైతు కుమారుడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు**


**ఎల్కతుర్తి, జూలై 7 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామర గ్రామం కొత్తపల్లి శివారులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు కరెంట్ షాక్‌కు కారణమై ఒక పాడి ఆవు, పెంపుడు కుక్క మృతి చెందగా, రైతు కుమారుడు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

దామర గ్రామానికి చెందిన మంతుర్తి మొగిలి (తండ్రి కొమురయ్య) కుటుంబానికి సర్వే నంబర్ 524లో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిపై నుంచి చాలా కాలంగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయకుండా తాత్కాలికంగా తీగలను అతికించి వదిలేశారని బాధిత రైతు ఆరోపించారు.

మంగళవారం అకస్మాత్తుగా విద్యుత్ తీగ తెగి నేలపై పడటంతో మేతకు వెళ్లిన పాడి ఆవు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రోజుకు సుమారు 10 లీటర్ల పాలు ఇస్తూ కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. అదే సమయంలో అక్కడ కాపలాగా ఉన్న పెంపుడు కుక్క కూడా కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయింది.

ఆవు లేవడం లేదని భావించిన రైతు కుమారుడు చింటూ దగ్గరకు వెళ్లి ముట్టుకోగా అతనికీ కరెంట్ షాక్ తగిలింది. స్థానికులు అప్రమత్తమై వెంటనే సహాయం చేయడంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ప్రాణాలు పోతున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ.. నిర్లక్ష్యంగా వేలాడే తీగలే సాక్ష్యం" అని మండిపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ తీగలను వెంటనే తొలగించి కొత్త తీగలు ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన పాడి ఆవుకు తగిన నష్టపరిహారం మంజూరు చేసి బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు, రైతులు విజ్ఞప్తి చేశారు.





# వెల్టూర్ ఉన్ని చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా చింతల వెంకటేశ్వర్లు ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దమందడి,జూలై07(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పరిధిలోని వెల్టూర్ ఉన్ని చేనేత పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షులుగా చింతల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సంఘం పాలకవర్గ కమిటీని కూడా సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా మూలమల్ల బీరయ్య, కార్యదర్శిగా ఎల్లన్న, కోశాధికారిగా వెంకటయ్య, డైరెక్టర్లుగా నరసింహ, ఎర్ర మల్లయ్య, మూలమల్ల రాములు, చింతల సరిత, సాంబ మల్లమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం చింతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘ అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానన్నారు. చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.అలాగే గతంలో డీసీసీబీ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవాన్ని చేనేత రంగ అభివృద్ధికి వినియోగిస్తానని పేర్కొన్నారు. టెస్కో రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవికి అవసరమైన అన్ని అర్హతలు తనకు ఉన్నాయని, అవకాశం కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తానని తెలిపారు.

# ఘనంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 62వ జన్మదిన వేడుకలు

**వనపర్తి,జులై 07(తెలంగాణ ముచ్చట్లు):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 62వ జన్మదినోత్సవం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదిగ ఉద్యోగుల సమాఖ్య వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీ గద్వాల కృష్ణ హాజరై, జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చౌక్ వద్ద కేక్ కోసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు.అనంతరం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు యాపిల్లు, అరటి పండ్లు పంపిణీ చేసి మానవతా సేవలను చాటిచెప్పారు.ఈ కార్యక్రమాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొరెల్లి వెంకటయ్య, సీనియర్ నాయకులు కేశపాగ కేశవులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొమ్ము కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న నిరంతర పోరాటాన్ని కొనియాడారు.



# దొడగుంటపల్లిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

**పెద్దమందడి,జూలై07(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదిగల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎమ్మార్పీఎస్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను నిర్వహించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.గ్రామపంచాయతీ రోడ్డు వద్ద గ్రామ సర్పంచ్ కొమ్ము పెంటయ్య మాదిగ జెండాను ఆవిష్కరించగా, కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొమ్ము చెన్నకేశవులు మాదిగ మాట్లాడుతూ.. 32 ఏళ్లుగా రాజీలేని పోరాటంతో అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తోందన్నారు. మాదిగలకే కాకుండా సమాజంలోని అన్ని పీడిత వర్గాల పక్షాన ఉద్యమిస్తూ ఆరోగ్యశ్రీ, వికలాంగులు, వృద్ధులు, వితంతువుల సంక్షేమం, రేషన్ బియ్యం పెంపు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు వంటి అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన సుదీర్ఘ ఉద్యమ ఫలితంగానే తెలంగాణలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చి మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు దక్కాయని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. దేశంలో 100 శాతం విజయవంతమైన ఉద్యమాలకు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడిన ఆయన, సమానత్వ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అండగా నిలవాలని కోరారు. ప్రతి ఏడాది జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని శ్రేణులకు సూచించారు .ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొమ్ము శాంతమ్మ, మాజీ ఉపసర్పంచ్ కొమ్ము చెన్నమ్మ, బీసీ సంఘం నాయకులు గుపాని వెంకటేష్, రవీందర్, మాజీ వార్డు సభ్యులు కొమ్ము తిరుపతయ్య మాదిగ, యువకులు శ్రీను, కొమ్ము దేవరాజు, నాగన్న, కొమ్ము బాలకృష్ణ, మహిళలు బక్కమ్మ, కురవతమ్మ, కొండమ్మ, జానకమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## అందమైన చేతిరాతతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది




- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,జులై 07(తెలంగాణ ముచ్చట్లు-):**విద్యార్థుల అందమైన చేతిరాత వారి భావి జీవితంపై సానుకూల ప్రభావం చూపడంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తుందని సాహితీ కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరిజనవాడలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు, న్యూ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో తరుణ్ మాస్టర్ నిర్వహించిన ఒకరోజు ఉచిత చేతిరాత శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు .ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ..చక్కని చేతిరాత విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, తప్పులు లేకుండా రాసే అలవాటును పెంపొందిస్తుందని తెలిపారు. అందమైన చేతిరాత విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడంలోనే కాకుండా ఉపాధ్యాయుల ప్రశంసలు పొందేందుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థుల్లో చేతిరాతపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, చేతిరాత శిక్షణ నిపుణుడు తరుణ్ మాస్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.అనంతరం పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కలిసి తరుణ్ మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిపుణుడు తరుణ్ మాస్టర్, సహాయకురాలు మీనా, ఉపాధ్యాయులు రవికుమార్, అరవింద్, విజయ్‌కుమార్, రుక్ముద్దీన్, రంగనాయకమ్మ, నాగరాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సాగు సీజన్‌లో రైతులు అప్రమత్తంగా ఉండాలి: పుల్లూరి స్వప్న సదానందం



**జమ్మికుంట టౌన్ జూలై 07 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం సూచించారు.
ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువుల దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా కొనుగోలు బిల్లులను భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.
ఎరువుల దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిర్ణీత ధరలకే ఎరువులను విక్రయించాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
దుకాణాల్లో ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించి, తగిన నిల్వలను ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. రైతులు, వ్యాపారులు పరస్పర సహకారంతో ఈ వ్యవసాయ సీజన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వంగర గ్రామంలో బావిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కలకలం



**భీమదేవరపల్లి, జూలై 7(తెలంగాణ ముచ్చట్లు):** నుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ శివారులోని ఓ బావిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమవడంతో గ్రామంలో కలకలం రేగింది. స్థానికులు బావిలో మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి ఆమె గుర్తింపు కోసం ప్రయత్నాలు చేపట్టడంతో పాటు, మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 25వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం

- **కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు**



**హుజురాబాద్, జూలై 7(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో నిర్వహించిన ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు పాల్గొని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు.
ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని ఆమె సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు (బి ఎల్ ఓ లు), బీఎల్‌ఏలు (బి ఎల్ ఏ లు), వార్డ్ ఆఫీసర్, కోఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్ చేనేత సంఘం అధ్యక్షుడు చింతల వెంకటేశ్వర్లకు ఘన సన్మానం



**పెద్దమందడి,జూలై07(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ ఉన్ని చేనేత పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతల వెంకటేశ్వర్లను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, ఖిల్లా ఘనపూర్-పెద్దమందడి మండలాల వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ రవీందర్ కలిసి చింతల వెంకటేశ్వర్లకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధికి చింతల వెంకటేశ్వర్లు సమర్థవంతంగా సేవలందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో వెల్టూర్ చేనేత సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.సన్మానానికి స్పందించిన చింతల వెంకటేశ్వర్లు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులతో పాటు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, అందరి సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# కోరపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో మౌలిక వసతులపై సమగ్ర సోషల్ ఆడిట్

- **పాఠశాల మౌలిక వసతులు, బోధన, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సంక్షేమంపై సమగ్ర తనిఖీ**



**జమ్మికుంట టౌన్ జూలై 07 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం కోరపల్లి జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిటర్ గజ్జల రవీందర్ పాఠశాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షుణ్ణంగా పరిశీలించి పలు అంశాలపై వివరాలను సేకరించారు. పాఠశాలలో తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీటి, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్ల సౌకర్యాలు, విద్యుత్ వసతులు, ఆటస్థలం, ప్రహరీ గోడ, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, గణిత కిట్, ఐఎఫ్‌బీ ప్యానెల్ బోర్డుల వినియోగం, హ్యాండ్‌వాష్ సదుపాయాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, రవాణా సౌకర్యం, హాజరు శాతం, డ్రాప్‌ఔట్ విద్యార్థుల వివరాలు, గ్రీవెన్స్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి అంశాలపై సమగ్ర సమాచారం నమోదు చేశారు. అదనంగా ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్‌పర్సన్ బండారి రజిత, తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, క్లబ్‌ల నిర్వహణ, బోధన విధానాలపై కూడా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కేతిరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను అంచనా వేసి అవసరమైన మెరుగుదలలు చేపట్టేందుకు ఇలాంటి సోషల్ ఆడిట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సెస్ బృందం సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించనున్నట్లు తెలిపారు.





# జమ్మికుంట మున్సిపల్ కార్యాలయానికి ట్రైనింగ్ కలెక్టర్ హరిప్రసాద్

**జమ్మికుంట టౌన్ జూలై 07 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనింగ్ కలెక్టర్ పి. హరిప్రసాద్‌కు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘన స్వాగతం పలికి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ట్రైనింగ్ కలెక్టర్‌కు అధికారులు వివరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణను ఆయన పరిశీలించారు. తర్వాత వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ కలెక్టర్ పి. హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, వైస్ చైర్మన్ ముంతాజ్ జావేద్ అలీ, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డూప్ లేకుండానే చిరంజీవి యాక్షన్.. 'చిరు 158' షూటింగ్ జోరుగా

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం ఈ హిట్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'చిరు 158' అనే తాత్కాలిక పేరుతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న కీలక షెడ్యూల్‌లో చిరంజీవిపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో రూపొందుతున్న ఈ పోరాట ఘట్టం కథలో కీలక మలుపుగా నిలవనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సన్నివేశాల్లో చిరంజీవి శక్తివంతమైన అవతారంలో కనిపించనున్నట్లు సమాచారం.

మరో విశేషం ఏమిటంటే.. ఈ యాక్షన్ సన్నివేశాల కోసం చిరంజీవి డూప్‌ను ఉపయోగించకుండా స్వయంగా ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. వయస్సును లెక్కచేయకుండా పూర్తి అంకితభావంతో చిత్రీకరణలో పాల్గొంటున్న ఆయన తీరును చిత్రబృందం ప్రశంసిస్తున్నట్లు తెలుస్తోంది.

భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రానికి త్వరలోనే అధికారిక పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. టైటిల్ ప్రకటనతో పాటు ప్రత్యేక టీజర్‌ను కూడా విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఈ చిత్రానికి సంగీతాన్ని తమన్ అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలను విజయ్ కార్తీక్ కన్నన్ నిర్వహిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, వాణిజ్య అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.

## వెంకటేష్–కల్యాణ్ రామ్ మల్టీస్టారర్ షూటింగ్ జోరు..




దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న వెంకటేష్-కల్యాణ్ రామ్ మల్టీస్టారర్ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. తొలిసారి ఈ ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కామెడీ, కుటుంబ భావోద్వేగాలు, మాస్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేస్తోంది.

ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు వెంకటేష్ కూడా చిత్రీకరణలో పాల్గొనడంతో షూటింగ్ వేగం పెరిగింది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్ రామ్‌తో పాటు కథానాయికలు కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు.

ఈ షెడ్యూల్‌లో ముఖ్యంగా వెంకటేష్, కల్యాణ్ రామ్‌ల మధ్య వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇద్దరి పాత్రల మధ్య ఉండే వినోదభరితమైన సంభాషణలు, భావోద్వేగ క్షణాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. కుటుంబ కథా చిత్రాలకు వినోదాన్ని జోడించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి, ఈ చిత్రంలో కూడా తనదైన శైలిలో నవ్వులు, భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరించేలా కథను మలిచినట్లు తెలుస్తోంది.

వెంకటేష్ సరసన కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నారు. ఈ నాలుగు ప్రధాన పాత్రల చుట్టూనే కథ తిరుగుతుందని సమాచారం. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలను సమీర్ రెడ్డి నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎ.ఎస్. ప్రకాష్ నిర్మాణ రూపకర్తగా, ఎస్. కృష్ణ కార్యనిర్వాహక నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## 'రోమాంచకం'తో సందీప్ రెడ్డి వంగా మరో ప్రేమకథ



'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో మరో యూత్‌ఫుల్ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'రోమాంచకం' అనే పేరును ఖరారు చేశారు. 'మేమ్ ఫేమస్' చిత్రంతో గుర్తింపు పొందిన సుమంత్ ప్రభాస్, 'ఎనిమిది వసంతాలు' చిత్రంతో ఆకట్టుకున్న అనంతిక సనిల్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ప్రేమ, హాస్యం, ఉత్కంఠ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ గ్లింప్స్‌లో సముద్ర తీరంలో హీరో, హీరోయిన్ మధ్య సాగే బైక్ ప్రయాణం, రొమాంటిక్ దృశ్యాలు ఆకట్టుకుంటాయి. అయితే గ్లింప్స్ చివర్లో దర్శకుడు ఊహించని మలుపు చూపించారు. ఒకరినొకరు చెంపదెబ్బలు కొట్టుకుంటూ 'నిన్ను ద్వేషిస్తున్నాను' అని అరుస్తూ కనిపించే హీరో, హీరోయిన్ పాత్రలు కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రశాంతంగా సాగిన ప్రేమకథ ఒక్కసారిగా భావోద్వేగ మలుపు తిరగడంతో సినిమా కథలో విభిన్నమైన అంశాలు ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ యూత్‌ఫుల్ ప్రేమకథను సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.



## అండాలను భద్రపరచుకున్న కృతి సనన్

బాలీవుడ్ ప్రముఖ కథానాయిక కృతి సనన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక విషయాన్ని తాజాగా వెల్లడించారు. వివాహం, మాతృత్వం విషయంలో మహిళలు ఎదుర్కొనే వయసు సంబంధిత, సామాజిక ఒత్తిడిని అధిగమించేందుకు తాను కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను భద్రపరచుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల తన జీవితాన్ని ఎలాంటి సమయ పరిమితి ఒత్తిడి లేకుండా, తనకు నచ్చిన విధంగా ముందుకు తీసుకెళ్లే స్వేచ్ఛ లభించిందని ఆమె పేర్కొన్నారు.

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కృతి మాట్లాడుతూ, వివాహం చేసుకోవాలి, పిల్లలను కనాలి అనే నిర్ణయాలు సమాజం ఒత్తిడి వల్ల కాకుండా వ్యక్తిగతంగా సిద్ధమైనప్పుడు మాత్రమే తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. వయసు పెరుగుతోందనే ఆందోళనతో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం తనకు ఇష్టం లేదని చెప్పారు. అందుకే ముందుగానే అండాలను భద్రపరచుకోవాలని నిర్ణయించుకున్నానని వివరించారు.

ఈ అవకాశం ప్రతి మహిళకు అందుబాటులో ఉండకపోయినా, తాను ఆ నిర్ణయం తీసుకునే పరిస్థితిలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. జాతీయ పురస్కారం అందించిన 'మిమి' చిత్రం కోసం తాను పదిహేను కిలోల బరువు పెరగాల్సి వచ్చిన సమయంలోనే ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు కృతి తెలిపారు. ఆ సమయంలో చిత్రీకరణ లేకపోవడం వల్ల కొంత విరామం దొరికిందని, అదే సరైన సమయంగా భావించి వైద్యుల సలహాతో ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. మాతృత్వం ప్రధానాంశంగా తెరకెక్కిన ఆ సినిమా కూడా ఈ విషయంలో తన ఆలోచనలను మరింత బలపరిచిందని పేర్కొన్నారు.

అయితే అండాలను భద్రపరచుకునే ప్రక్రియ అంత సులభం కాదని కృతి స్పష్టం చేశారు. హార్మోన్ల మార్పుల కారణంగా శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని, భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులు కూడా కనిపించాయని తెలిపారు. అయినప్పటికీ, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత తనలో ఎంతో మానసిక ప్రశాంతత ఏర్పడిందని చెప్పారు.

ఇప్పుడు తనపై వయసు ఒత్తిడి లేదనే భావన కలుగుతోందని, భవిష్యత్తులో అవసరమైతే ఒక అవకాశం తన చేతిలో ఉందనే ధైర్యం లభించిందని కృతి వివరించారు. దీనిని తాను ఒక రక్షణ కవచంగా భావిస్తున్నానని, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వినియోగించకపోయినా, నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ మాత్రం తన వద్ద ఉందని చెప్పారు. కెరీర్, వ్యక్తిగత జీవితం రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ, తన మనసు చెప్పిన దారిలో ముందుకు సాగేందుకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడిందని కృతి సనన్ వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం... ఓటు వేయడంతోనే బాధ్యత పూర్తవుతుందా?



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అత్యున్నత శక్తి. ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి, ప్రభుత్వాల పనితీరు అన్నీ చివరికి ప్రజల భాగస్వామ్యంపైనే ఆధారపడి ఉంటాయి. అయితే ప్రజాస్వామ్యంలో బాధ్యత అనగానే చాలామంది ఓటు వేయడాన్నే గుర్తు చేసుకుంటారు. ఎన్నికల రోజున ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమైనదే అయినప్పటికీ, ప్రజాస్వామ్యంలో పౌరుడి బాధ్యత అక్కడితో ముగిసిపోదు. ప్రజల చైతన్యం, నిరంతర భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన వైఖరే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. అయితే ఓటు వేసిన తర్వాత ఐదేళ్ల పాటు ప్రజా సమస్యలపై స్పందించకుండా ఉండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారులుగా ఉండాలంటే ప్రజలు కూడా నిరంతరం ప్రశ్నించే సంస్కృతిని అలవర్చుకోవాలి. ప్రజా సమస్యలను చట్టబద్ధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజాస్వామ్యం అంటే కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు, శాసనసభలు, పార్లమెంట్, న్యాయ వ్యవస్థ, స్వతంత్ర సంస్థలు, ప్రజా మాధ్యమాలు, పౌర సమాజం——ఇవన్నీ కలిసి ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచుతాయి. వీటి పనితీరును గమనించడం, ప్రజలకు సంబంధించిన నిర్ణయాలను అర్థం చేసుకోవడం, అవసరమైనప్పుడు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం ప్రజల బాధ్యత. దేశాభివృద్ధికి ప్రభుత్వ కార్యక్రమాలు ఎంత అవసరమో, ప్రజల సహకారం కూడా అంతే అవసరం. పన్నులు చెల్లించడం, చట్టాలను గౌరవించడం, ప్రజా ఆస్తులను సంరక్షించడం, పర్యావరణాన్ని కాపాడడం, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం వంటి అంశాలు కూడా ప్రజాస్వామ్యంలో పౌర బాధ్యతలే. ప్రభుత్వం మాత్రమే అన్నీ చేస్తుందని భావించడం సరైన దృక్పథం కాదు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి విజయాన్ని సాధించలేదు. డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యానికి కొత్త అవకాశాలతో పాటు కొత్త సవాళ్లు కూడా వచ్చాయి. సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం వేగంగా అందుతున్నప్పటికీ, అసత్య ప్రచారం కూడా అదే వేగంతో వ్యాపిస్తోంది. వాస్తవాలను నిర్ధారించకుండా వాటిని పంచుకోవడం సమాజంలో గందరగోళానికి దారితీస్తుంది. అందువల్ల ప్రతి పౌరుడు సమాచారాన్ని పరిశీలించి, బాధ్యతాయుతంగా వ్యవహరించడం నేటి కాలంలో మరింత అవసరమైంది. స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు స్థానిక సంస్థలతో కలిసి పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. విమర్శించడం మాత్రమే కాకుండా పరిష్కార మార్గాలను సూచించడం, స్వచ్ఛందంగా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుంది.

యువత ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు. రాజకీయాలపై అవగాహన పెంచుకోవడం, రాజ్యాంగ విలువలను తెలుసుకోవడం, ప్రజా విధానాలను అధ్యయనం చేయడం, సమాజ సమస్యలపై బాధ్యతతో స్పందించడం వంటి లక్షణాలు యువతలో పెరిగితే దేశ భవిష్యత్తు మరింత బలపడుతుంది. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల ప్రక్రియగా కాకుండా నిరంతర ప్రజా భాగస్వామ్యంగా భావించే ఆలోచన పెరగాలి. అదే సమయంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించాలి. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను కలవడం కాకుండా, తమ హామీల అమలు గురించి తరచుగా వివరించడం, ప్రజల అభిప్రాయాలను వినడం, పారదర్శకంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుంది. పరస్పర విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. ప్రజాస్వామ్యంలో విమర్శలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. అయితే విమర్శలు వాస్తవాల ఆధారంగా, నిర్మాణాత్మకంగా ఉండాలి. భిన్నాభిప్రాయాలను గౌరవించడం, చర్చల ద్వారా పరిష్కారాలను అన్వేషించడం ప్రజాస్వామ్య సంస్కృతికి మూలాధారం. విభేదాలను వైరం కాకుండా అభివృద్ధికి అవకాశంగా మార్చుకోవడం ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ వ్యవస్థ నేర్చుకోవాల్సిన అంశం. ప్రజాస్వామ్యం ఒక రోజు జరిగే ఎన్నికలతో ముగిసే వ్యవస్థ కాదు. అది ప్రతిరోజూ ప్రజల చైతన్యంతో, బాధ్యతతో, భాగస్వామ్యంతో ముందుకు సాగే జీవంతమైన ప్రక్రియ. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ఆరంభం మాత్రమే; ప్రజా సమస్యలపై స్పందించడం, చట్టాలను గౌరవించడం, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం, ప్రజాప్రతినిధులను జవాబుదారులుగా నిలబెట్టడం, రాజ్యాంగ విలువలను కాపాడడం వంటి బాధ్యతలను ప్రతి పౌరుడు నిర్వర్తించినప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో బలపడుతుంది. దేశ ప్రగతికి ప్రజల చైతన్యమే అతిపెద్ద బలం.



# వ్యాయామం లేని జీవితం... కొత్త వ్యాధులకు ఆహ్వానం

- **రోజువారీ శారీరక శ్రమ తగ్గడంతో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు**
- **గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం బారిన పడుతున్న యువత**
- **నడక, యోగా, సైక్లింగ్ వంటి అలవాట్లతోనే ఆరోగ్యానికి భరోసా**

ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ గణనీయంగా తగ్గిపోవడం కొత్త ఆరోగ్య సమస్యలకు దారితీస్తోంది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చోవడం, మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడం, నడకకు బదులుగా వాహనాలపై ఆధారపడటం, వ్యాయామానికి సమయం కేటాయించకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే అనేక దీర్ఘకాలిక వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో కనిపించే అనారోగ్య సమస్యలు నేడు యువతలోనూ ఆందోళనకరంగా పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయని వారిలో ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. శారీరక శ్రమ తగ్గడం వల్ల శరీరంలోని జీవక్రియలు మందగించి అదనపు కొవ్వు పేరుకుపోతుంది. దీంతో అనేక అనారోగ్య సమస్యలకు ఇది ప్రధాన కారణంగా మారుతోంది. కార్యాలయాల్లో గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేసే ఉద్యోగులు, చదువుల ఒత్తిడితో బయట ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు, రోజువారీ నడక అలవాటు కోల్పోయిన పట్టణవాసులు ఎక్కువ ప్రమాదంలో ఉన్నారని వైద్యులు సూచిస్తున్నారు. శారీరక చురుకుదనం తగ్గితే కండరాల బలం, ఎముకల దృఢత్వం కూడా క్రమంగా తగ్గిపోతుంది. మానసిక ఆరోగ్యంపై కూడా వ్యాయామం ప్రభావం ఎంతో ఉంటుంది. క్రమం తప్పకుండా నడక, యోగా, జాగింగ్, సైక్లింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేసే వారిలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. వ్యాయామం శరీరాన్ని మాత్రమే కాదు, మనసును కూడా ఉల్లాసంగా ఉంచుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అరగంట నుంచి గంట వరకు శారీరక శ్రమకు సమయం కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేగంగా నడవడం, యోగా చేయడం, మెట్లు ఎక్కడం, తోటపని చేయడం, పిల్లలతో కలిసి ఆడుకోవడం వంటి సాధారణ అలవాట్లు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా మార్చుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# చిన్న జీవులే.. జల ప్రపంచానికి పెద్ద బలం

- **స్కడ్ జీవుల ప్రాధాన్యంపై అవగాహన పెరగాలి**



ప్రకృతిలో ప్రతి జీవికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. కంటికి కనిపించని లేదా చాలా చిన్న పరిమాణంలో ఉండే జీవులు కూడా పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. అలాంటి జీవుల్లో స్కడ్‌లు ఒకటి. రొయ్యలను పోలి ఉండే ఈ చిన్న జలచరాలు సముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు, తడినేల ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తాయి. పరిమాణంలో చిన్నవైనా జల జీవావరణ వ్యవస్థకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి. స్కడ్‌లు ప్రధానంగా సేంద్రియ పదార్థాలు, కుళ్లిపోయిన మొక్కల అవశేషాలు, నీటిలో పెరిగే సూక్ష్మ శైవలాలను ఆహారంగా తీసుకుంటాయి. ఈ ప్రక్రియ ద్వారా నీటిలో పేరుకుపోయే వ్యర్థాలను తగ్గించి సహజ పరిశుభ్రతను కాపాడటానికి తోడ్పడతాయి. అందువల్ల వీటిని ప్రకృతి స్వయంగా ఏర్పాటు చేసుకున్న పరిశుభ్రత కార్మికులుగా పర్యావరణ శాస్త్రవేత్తలు అభివర్ణిస్తుంటారు. జల జీవుల ఆహార గొలుసులో స్కడ్‌ల పాత్ర అత్యంత కీలకమైనది. చిన్న చేపలు, పెద్ద చేపలు, కప్పలు, నీటి పక్షులు, ఇతర జలచరాలు వీటిని ఆహారంగా తీసుకుంటాయి. స్కడ్‌ల సంఖ్య తగ్గితే వాటిపై ఆధారపడే జీవులపై కూడా ప్రభావం పడుతుంది. చివరికి మొత్తం జల జీవావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. శాస్త్రవేత్తలు నీటి నాణ్యతను అంచనా వేయడానికి స్కడ్‌లను సూచిక జీవులుగా ఉపయోగిస్తుంటారు. స్వచ్ఛమైన నీటిలో ఇవి బాగా అభివృద్ధి చెందుతాయి. నీరు కలుషితమైతే లేదా విషపూరిత రసాయనాలు పెరిగితే వీటి సంఖ్య వేగంగా తగ్గుతుంది. అందువల్ల ఒక ప్రాంతంలోని స్కడ్‌ల పరిస్థితిని పరిశీలించడం ద్వారా ఆ నీటి వనరుల ఆరోగ్యంపై ప్రాథమిక అంచనా వేయవచ్చు. ప్రస్తుతం పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ కాలుష్యం, వ్యవసాయంలో అధికంగా ఉపయోగించే రసాయనాలు, మురుగునీటి విడుదల వంటి కారణాలతో అనేక జలవనరులు కలుషితమవుతున్నాయి. ఈ పరిస్థితి స్కడ్‌లతో పాటు అనేక సూక్ష్మ జలచరాల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఇది భవిష్యత్తులో చేపల ఉత్పత్తి, జీవవైవిధ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులు కూడా స్కడ్‌లపై ప్రభావం చూపుతున్నాయి. నీటి ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తీరు మారడం, వరదలు, కరువు వంటి పరిస్థితులు జలచరాల జీవన చక్రాన్ని దెబ్బతీస్తున్నాయి. చిన్న జీవులు ముందుగా ప్రభావితమైతే ఆ తర్వాత మొత్తం జీవావరణ వ్యవస్థపై దాని ప్రభావం కనిపించడం సహజమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్కడ్‌లు ప్రత్యక్షంగా మనిషికి కనిపించకపోయినా, వాటి ద్వారా లభించే పరోక్ష ప్రయోజనాలు ఎంతో ఉన్నాయి. ఆరోగ్యకరమైన జల జీవావరణం కొనసాగితే చేపల ఉత్పత్తి మెరుగుపడుతుంది. మత్స్యకారుల జీవనోపాధి బలోపేతం అవుతుంది. నీటి వనరుల సహజ సమతుల్యత కొనసాగుతుంది. అందువల్ల ఈ చిన్న జీవులను సంరక్షించడం అంటే మన భవిష్యత్తు నీటి వనరులను కాపాడుకోవడమే. జలవనరుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ఉండటం, రసాయన కాలుష్యాన్ని తగ్గించడం, పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేసి విడుదల చేయడం, చెరువులు, సరస్సుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి చర్యలు స్కడ్‌లతో పాటు అనేక సూక్ష్మ జీవులను రక్షించడంలో దోహదపడతాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. ప్రకృతిలో ఏ జీవి చిన్నది కాదు. ప్రతి జీవి తనకంటూ ఒక ప్రత్యేక బాధ్యతను నిర్వహిస్తుంది. మన కంటికి కనిపించని జీవులే పర్యావరణాన్ని సమతుల్యంలో ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తుంటాయి. స్కడ్‌ల వంటి సూక్ష్మ జలచరాల ప్రాధాన్యాన్ని గుర్తించడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. సహజ వనరులను కాపాడుకోవాలంటే పెద్ద జంతువులు, అరుదైన పక్షులను మాత్రమే కాదు, స్కడ్‌ల వంటి చిన్న జీవులను కూడా సంరక్షించాల్సిందే. ప్రకృతిలో ప్రతి జీవి పరస్పరం అనుసంధానమై ఉంటుంది. ఒక జీవి అంతరించిపోతే దాని ప్రభావం మొత్తం జీవావరణంపై పడుతుంది. అందుకే జల జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# గవర్నర్‌ను కలిసిన టెలిమెడిసిన్ ప్రతినిధులు

- లోక్‌భవన్‌లో మర్యాదపూర్వక భేటీ
- టెలిమెడిసిన్ సేవలపై చర్చ
- గవర్నర్‌కు వినతులు

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**



టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామచంద్ర విష్ణుభట్టతో పాటు పలువురు ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవల విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. భేటీ సందర్భంగా టెలిమెడిసిన్ సేవల ప్రాధాన్యం, సాంకేతికత ఆధారిత వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే అవకాశాలపై ప్రతినిధులు గవర్నర్‌కు వివరించారు. ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. టెలిమెడిసిన్ సేవల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను చేరువ చేయవచ్చని ప్రతినిధులు తెలిపారు. డిజిటల్ సాంకేతికతతో వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆసక్తిగా విన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు సాంకేతికత వినియోగం ఎంతో కీలకమని ఈ సందర్భంగా అభిప్రాయపడినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. భేటీలో రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజారోగ్య రంగంలో కొత్త అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖకు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్‌తో కలిసి జ్ఞాపికలు మార్చుకుని మర్యాదపూర్వకంగా సమావేశాన్ని ముగించారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం మహాసభ

- ఆగస్టు 6న హైదరాబాద్‌లో బహిరంగ సభ
- 50 శాతం రిజర్వేషన్లే లక్ష్యం
- సామాజిక న్యాయ ఉద్యమానికి పిలుపు

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**




బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ సూచించిన సామాజిక న్యాయ తెలంగాణ లక్ష్య సాధన దిశగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు.

జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన గత రెండేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉద్యమం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ ఉద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు ఆగస్టు 6 సభ వేదిక కానుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ సభ దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తుందని కవిత అభిప్రాయపడ్డారు. తమిళనాడులో ప్రారంభమైన మధ్యాహ్న భోజన పథకం దేశవ్యాప్తంగా అమలైనట్లే, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల ఉద్యమం కూడా దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, శాసనమండలిలో బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఆమోదించి కేంద్రానికి పంపినప్పటికీ, వాటి ఆమోదం కోసం తగిన స్థాయిలో ప్రయత్నాలు జరగడం లేదని ఆమె విమర్శించారు. "మనమెంతో... మనకంత" అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని కవిత పిలుపునిచ్చారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రజలంతా ఆగస్టు 6న జరిగే బహిరంగ సభకు భారీగా హాజరై ఉద్యమానికి మద్దతు తెలపాలని ఆమె కోరారు.

# అసెంబ్లీలో నూతన కార్యాలయాల ప్రారంభం

- స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభం
- విప్‌లకు శుభాకాంక్షలు
- మీడియా కమిటీ కార్యాలయం ప్రారంభం

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ శాసనసభలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు కార్యాలయాలను రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ విప్‌లు, శాసనమండలి విప్‌ల కార్యాలయాలతో పాటు అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ విప్ వేముల వీరేశం కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం శాసనమండలి విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నూతన కార్యాలయాలను కూడా ప్రారంభించి వారికి అభినందనలు తెలిపారు. అదే సందర్భంగా అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. శాసనసభ కార్యకలాపాల సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో మీడియా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

శాసనసభలో ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తోందని అధికారులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నూతన కార్యాలయాల ప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శాసనసభలో ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనా సమన్వయం మరింత మెరుగుపడేందుకు ఈ వసతులు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసనసభ, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యాలయాల ప్రారంభంతో శాసనసభ పరిపాలనా కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పులిచింతలలో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్యాయత్నంతో ఉద్రిక్తత
- ఉద్యోగాల కోసం ధర్నా
- తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

**సూర్యాపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఆర్టిజెన్ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు కార్మికులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న కార్మికులు మాట్లాడుతూ తమను శాశ్వత ఉద్యోగులుగా చేస్తామని హామీ ఇచ్చి ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేయించుకున్నారని ఆరోపించారు. కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వహించినప్పటికీ ఇప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు కోల్పోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కార్మికులు తెలిపారు. అకస్మాత్తుగా విధుల నుంచి తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన సమయంలో కొందరు కార్మికులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, అక్కడే ఉన్న సహచరులు, అధికారులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనతో విద్యుత్ కేంద్రం పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. శాశ్వత నియామకాలపై గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం, సంబంధిత సంస్థలు అమలు చేయాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కార్మికులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, కార్మికుల డిమాండ్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

# రూ.70 వేల లంచంతో పట్టుబడ్డ తహసీల్దార్

- చేర్యాలలో ఏసీబీ దాడి
- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్
- భూ మార్పిడి కోసం డిమాండ్

**సిద్దిపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**



సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే ప్రక్రియలో ఓ రైతు నుంచి రూ.70 వేల లంచం డిమాండ్ చేసిన ఆయన, ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడైన రైతు నుంచి భూ వినియోగ మార్పిడి ప్రక్రియకు అనుమతులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు పథకం ప్రకారం ఉచ్చుపన్ని దాడి నిర్వహించారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు అక్కడే దాడి చేసి తహసీల్దార్‌ను పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం అవసరమైన పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో చేర్యాల తహసీల్దార్ కార్యాలయంలో కలకలం రేగింది. అధికారుల సమక్షంలో కార్యాలయానికి సంబంధించిన పలు పత్రాలను ఏసీబీ బృందం పరిశీలించింది. కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలను కూడా సేకరించినట్లు సమాచారం. తహసీల్దార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. లంచం తీసుకునే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు ఇలాంటి ఘటనలు ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

# అటవీ శాఖకు కొత్త దిశ

- మంత్రిని కలిసిన ముఖ్య కార్యదర్శి
- పర్యావరణ పరిరక్షణపై చర్చ
- ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచన

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల నూతన ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్ సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాఖలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అటవీ, పర్యావరణ శాఖలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల అభివృద్ధి, జీవవైవిధ్య సంరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శికి దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రంలో వనమహోత్సవం, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అడవుల సంరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. అటవీ, పర్యావరణ శాఖల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

ఈ భేటీలో అటవీ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో ప్రస్తుతం అమలవుతున్న పలు కార్యక్రమాలపై మంత్రి కొండా సురేఖ, ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ సంక్షిప్తంగా చర్చించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను సాధించేందుకు అటవీ శాఖ అధికారులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ప్రగతి ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష

- అమలులో వేగం పెంచాలని ఆదేశం
- కీలక ప్రాజెక్టుల పురోగతిపై చర్చ
- అధికారులకు దిశానిర్దేశం

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సోమవారం సచివాలయంలో ప్రగతి (పీఎంజీ) ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిని పరిశీలిస్తూ వాటి అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులు వివరించారు. ప్రాజెక్టులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు త్వరగా ప్రయోజనాలు అందేలా పనుల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అమలులో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ప్రగతి ప్రాజెక్టుల విజయవంతమైన అమలు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు అందించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భూములపై భారీ కుట్ర జరుగుతోంది : బీఆర్ఎస్

- భూభారతి పోర్టల్‌పై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు
- రైతుల భూములు అక్రమంగా బదిలీ చేస్తున్నారని విమర్శ
- తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో రైతులు, భూమి యజమానుల ఆస్తులపై భారీ కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా, భూమి హక్కుల పరంగా తీవ్రంగా నష్టపరిచే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఒకవైపు సాగునీటి సమస్యలు సృష్టిస్తుండగా, మరోవైపు భూముల రికార్డుల్లో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ కన్నెపల్లి పంపు కేంద్రంలోని మోటార్లను ప్రారంభించకుండా రైతులకు సాగునీరు అందకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

భూభారతి పోర్టల్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమ భూమి బదిలీలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. దాదాపు 22 వేల భూ బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. భూమి యజమానులకు తెలియకుండానే వారి భూములను ఇతరుల పేర్లకు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల వివరాలను కూడా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి అక్రమంగా బదిలీ చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూముల రికార్డుల భద్రతపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. భూసంబంధిత లావాదేవీలలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్ సమర్థవంతంగా పనిచేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విషయంలో అవకతవకలు పెరిగాయని ఆయన విమర్శించారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయని ఆరోపించారు. భూముల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతులు, భూమి యజమానులు తమ ఆస్తుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, ఎలాంటి అనుమానాస్పద మార్పులు కనిపించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. భూముల రక్షణ కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీకి సిద్ధం : సీఎం

- ప్రతిపక్షం కోరిన తేదీకే సమావేశాలు నిర్వహిస్తాం
- నిపుణుల సూచనలతోనే పునరుద్ధరణ పనులు
- ప్రాజెక్టును కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):



కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర చర్చ కోసం శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు సూచించిన తేదీకే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అవసరమైతే అసెంబ్లీ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని కూడా నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టుపై కూలంకషంగా చర్చిద్దామని ప్రతిపాదించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే నిపుణులు, మేధావులు పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన పరిష్కారం సూచించకుండా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రాజెక్టు పునరుద్ధరణపై శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకుంటామని, నిపుణుల సూచనల మేరకే ముందుకు సాగుతామని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు నిపుణుల్లో విశ్వాసం కలిగించే పరిష్కారం చూపగలిగితే వారి ఆధ్వర్యంలోనే మరమ్మతు పనులు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం, ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రి వివరంగా ప్రస్తావించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన నుంచి కాళేశ్వరంగా మారిన పరిణామాలను వివరించారు. మొదట రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టు విస్తరణ వంటి అంశాల్లో లక్ష్యాలు నెరవేరకపోయినా వ్యయం మాత్రం భారీగా పెరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరం నిర్మాణం, రూపకల్పన, నిర్వహణలో ప్రమాణాలు పాటించి ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో పునాది స్థిరత్వం, భూగర్భ పరిస్థితులపై తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలపై ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు వచ్చినా వాటిని పట్టించుకోలేదన్నారు. కన్నెపల్లి పంపు కేంద్రంలో వరదల సమయంలో జరిగిన నష్టాన్ని కూడా గుర్తుచేశారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థతో పాటు పలు సాంకేతిక సంస్థల నివేదికలు కూడా నిర్మాణం, నాణ్యత, నిర్వహణలో లోపాలను స్పష్టంగా గుర్తించాయని తెలిపారు.


ప్రాజెక్టు విషయంలో ప్రజల్లో అపోహలు సృష్టించకుండా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి కోరారు. సభలో నిపుణులు, న్యాయ నిపుణులను కూడా ఆహ్వానించి అన్ని అంశాలపై పారదర్శకంగా చర్చిద్దామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, ప్రాజెక్టుపై చేసిన వ్యయంతో పాటు ప్రస్తుతం ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక బాధ్యతలను కూడా వివరించారు. అప్పులు చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు కూడా ఈ సందర్భంగా ప్రకటించారు.

# ఆయిల్‌పామ్ రైతులకు అండగా ఉంటాం

- భూపాలపల్లిలో రైతులతో సమావేశమైన కేటీఆర్
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక ప్రోత్సాహాలు
- మలేషియాలో అధ్యయన పర్యటనలు నిర్వహిస్తామని హామీ

భూపాలపల్లి, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):





బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయిల్‌పామ్ రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశమైన ఆయన వారి అనుభవాలు, సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో పంటల వైవిధ్యీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితాలపై రైతులతో చర్చించారు. తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలన్న లక్ష్యాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించారని కేటీఆర్ తెలిపారు. మలేషియా, ఇండోనేషియా దేశాల తరహాలో ఆయిల్‌పామ్ సాగును అభివృద్ధి చేసి దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించడంతో పాటు రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రోత్సహించామని చెప్పారు. వరి వంటి సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ ద్వారా మూడు రెట్లు ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సుమారు లక్షన్నర ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుతం దాదాపు మూడు లక్షల ఎకరాలకు విస్తరించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారం కొనసాగితే ఈ విస్తీర్ణం ఏడు లక్షల ఎకరాలకు చేరుకునే అవకాశముందని చెప్పారు. 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ఆ తర్వాత తెలంగాణను దేశంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ సాగు చేసే రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు రైతులు తమ అనుభవాలను కేటీఆర్‌తో పంచుకున్నారు. సమాచార సాంకేతిక రంగంలో ఉద్యోగం చేస్తున్న అనిల్ అనే రైతు తాను ఏడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నానని, నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి ప్రారంభమై ప్రస్తుతం ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. ఉద్యోగంలో జీతం వచ్చినట్లే ఈ పంట ద్వారా ప్రతి నెల స్థిరమైన ఆదాయం లభిస్తోందని చెప్పారు. ఇతర రైతులు కూడా ఈ పంట తక్కువ నీటితో సాగవుతుందని, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉందని వివరించారు.

రైతులు కూలీల కొరత, యాంత్రీకరణ అవసరం, అదనపు డ్రిప్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వ సహాయం, విదేశాల నుంచి తక్కువ ధరలకు దిగుమతి అవుతున్న పామాయిల్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వం యాంటీ డంపింగ్ విధానాన్ని అమలు చేసి దేశీయ రైతులను రక్షించాలని కోరారు. రైతుల సూచనలకు స్పందించిన కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ట్రాక్టర్లు, స్లాషర్లు వంటి వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు అధిక సబ్సిడీలు అందిస్తామని, రెండో దశ డ్రిప్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రత్యేక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆధునిక ఆయిల్‌పామ్ సాగు పద్ధతులను అధ్యయనం చేసేందుకు రైతులను మలేషియాకు ప్రత్యేక అధ్యయన పర్యటనలకు పంపిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని సమర్థంగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మేడిగడ్డలో ఒక భాగంలో సమస్య తలెత్తిందనే కారణంతో మొత్తం ప్రాజెక్టును పక్కన పెట్టడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. కన్నెపల్లి పంపు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని, నిలువ పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వయనాడ్‌లో ఘోర విషాదం

- టన్నెల్ వద్ద కొండచరియలు విరిగిపడి ముగ్గురు కార్మికులు దుర్మరణం
- సహాయక చర్యలు ముమ్మరం

వయనాడ్, జులై 7 (తెలంగాణ ముచ్చట్లు):

కేరళలోని వయనాడ్ జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో టన్నెల్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మట్టిదిబ్బలు, భారీ రాళ్ల కింద మరికొందరు చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. మీనాక్షి వంతెన సమీపంలో టన్నెల్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా భారీగా కొండచరియలు విరిగిపడటంతో నిర్మాణ ప్రాంతమంతా మట్టితో నిండిపోయింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు తప్పించుకునేలోపే మట్టిదిబ్బలు వారిపై పడటంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జాతీయ విపత్తు స్పందన దళం సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు భారీ యంత్రాలతో నిరంతరం మట్టిని తొలగిస్తున్నారు. రెస్క్యూ బృందాలు చేరుకునేలోపే స్థానికులు సైతం ధైర్యంగా సహాయక చర్యల్లో పాల్గొని పలువురిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఇప్పటివరకు ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా కొందరు చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉండటంతో గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనపై కేరళ ప్రభుత్వం వెంటనే స్పందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహాయక చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు సంబంధిత మంత్రులను సంఘటన స్థలానికి పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది.

గత 24 గంటల్లో వయనాడ్ ప్రాంతంలో 265 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా నేల బలహీనపడి కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టన్నెల్ నిర్మాణ పనులను సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ప్రమాదం సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. కొండచరియలు విరిగిపడటంతో సమీపంలో ఉన్న పలు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతుండగా, మరిన్ని కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాద ప్రాంతంలో ప్రజలు వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. సహాయక చర్యలు పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధితులను రక్షించేందుకు అన్ని వనరులను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in